క్లుప్తంగా...

నేడు డే కేర్ సెంటర్ ప్రారంభం

శామీర్‌పేట్: హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో శనివారం అవేక్ష డే కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. కోవే (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా), యూనిక్ బయోటెక్ లిమిటెడ్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఇండస్ట్రీస్, కామర్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ ప్రారంభించనున్నారని తెలిపారు.

సీపీఆర్‌పై అవగాహన



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులకు, సిబ్బందికి మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ స్వామి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, డాక్టర్ వెంకన్న, ఏఎన్ఎం అలివేలు, విజయ, రాణి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ స్థలాన్ని కాపాడాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో 750 గజాల హనుమాన్ దేవాలయ స్థలాన్ని కొందరు స్థానిక నాయకులు కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని సికింద్రాబాద్ విభాగం బజరంగ్‌దళ్ నాయకులు శ్రీకాంత్ ఆరోపించారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి రాజీవ్‌గాంధీనగర్‌లోని హనుమాన్ దేవాలయ స్థలాన్ని పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న హనుమాన్ దేవాలయ స్థలంపై స్థానికుల కన్ను పడిందని, దీనిపై పూర్తిస్థాయిలో అధికారులు విచారణ చేపట్టి స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. స్థానిక బీజేవైఎం నాయకుడు సంతోష్‌గుప్తాతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బొక్కొనిగూడలో ట్రాఫిక్ పీఎస్ వద్దని నిరసన

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను బొక్కొనిగూడలో ఏర్పాటు చేయకూడదని పలువురు స్థానికులు గ్రామంలో శుక్రవారం నిరసన చేపట్టారు. గ్రామంలో ఉన్న భవనంలో ప్రస్తుతం డ్వాక్రా మహిళల కార్యకలాపాలు, రేషన్ దుకాణం నడుస్తోందని గ్రామస్తులు వాపోయారు. స్థానికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యేసురెడ్డి, అశోక్‌రెడ్డి, సత్తిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

పేదల కోసం ఉపాధి హామీ పథకం

ఘట్‌కేసర్: దేశంలో పేదలు పస్తులుండొద్దని కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్‌లో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ కూలీ పథకం సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత రూ.100లు ఉన్న ఉపాధి కూలీ రూ.272లకు పెంచిందన్నారు. ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యులు సంధ్య, వీరేశం, నాయకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

9వ రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె

మేడ్చల్‌రూరల్: వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 9వ రోజు కొనసాగింది. మండలంలోని అన్ని గ్రామాల కార్మికులు మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా గ్రామాలను శుభ్రం చేసే పంచాయతీ కార్మికులకు ఏళ్ల తరబడి అన్యాయమే జరుగుతుందన్నారు.

‘మధ్యాహ్నం’లో పౌష్టికం మాయం

- ప్రభుత్వ పాఠశాలల్లో గాడితప్పిన మధ్యాహ్న భోజనం
- పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు.. బిల్లుల జాప్యం
- విద్యార్థులకు పౌష్టికాహారం అందకపోవడంతో ఆందోళన

ధరలు పెరిగే.. మెనూ అమలు భారమాయే..!



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు గాడి తప్పుతోంది. పెరిగిన కూరగాయలు, నిత్యావసర ధరలు, బిల్లుల చెల్లింపుల జాప్యంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో కొత్త మెనూను అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలు కూడా అమలు కావడం లేదు. కోడిగుడ్ల ధరలు పెరగడంతో వాటిని విద్యార్థులకు పెట్టడం లేదు. ఉడికీ ఉడకని అన్నం, రుచించని కూరలతో భోజనం చేసేందుకు విద్యార్థులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బకాయిలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికులకు చెల్లించాల్సిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దాదాపు 5 నెలల బిల్లులకు సంబంధించిన రూ.59 లక్షలతోపాటు గౌరవ వేతనాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇటీవల రెండు నెలల బిల్లులు మంజూరైనా.. కార్మికులకు చేరలేదని తెలుస్తోంది. ప్రభుత్వం కార్మికులకు పెంచిన గౌరవ వేతనాలు అమలు కావడంలేదు. అప్పు చేసి వంట చేస్తున్నా.. బిల్లులు చెల్లించడం లేదంటున్నారు. గతేడాది డిసెంబరు నుంచి కార్మికుల గౌరవ వేతనాలు చెల్లించాల్సి ఉంది.

వంట గది లేక..

మేడ్చల్ జిల్లాలో పలు బస్తీ పాఠశాలల్లో వంట గదులు సరిపోక ఆరుబయట వంటలు చేస్తున్నారు. కట్టెల పొయ్యిలపై చేస్తున్న వంటతో అన్నం ఉడకడం లేదని, కడుపునొప్పి వస్తోందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ఇక పెరిగిన ధరలు, పెండింగ్‌లో ఉన్న బిల్లులతో కొత్త మెనూ అమలు చేయడం లేదని వంట కార్మికులు చెబుతున్నారు. రూ.5 చొప్పున కోడిగుడ్డు ధర ప్రభుత్వం చెల్లిస్తుండగా, మార్కెట్‌లో ప్రస్తుతం దాని ధర రూ.7 పలుకుతుందన్నారు. వాటిని కూడా అందించడం లేదని చెబుతున్నారు. దీంతో కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం విద్యార్థులకు పెట్టడం లేదని తెలుస్తోంది. తక్కువ ధరలో దొరికే ఒకే రకం కూరగాయలతో వంట చేయడంతో రుచించడం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు.

ఆర్థిక భారం..

కొత్త మెనూను అమలు చేయడం లేదు. తక్కువ ధరలతో దొరికే వంకాయ వంటి కూరలతో భోజనం పెడుతుండటంతో రుచిగా ఉండటం లేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. కొత్త మెనూ అమలుతో మరింత ఆర్థిక భారం పడుతుందని, ఈ క్రమంలో దాన్ని అమలు చేయడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు పలువురు తెలిపారు. నిత్యావసర ధరలు పెరగడం, పాత బిల్లులు నెలల తరబడిగా రాకపోవడంతో అప్పు చేసి భోజనం పెడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్కూళ్ల అభివృద్ధిలో వేగం పెంచాలి



జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: సర్కారు పాఠశాలలను ప్రైవేట్‌కు ధీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు –మన బడి పథకం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశించారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశం మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మన ఊరు–మన బడి పనుల విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకుండా చూడాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉందని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మొదటి విడతలో 176 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 30 పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించి ప్రారంభోత్సవాలు చేసుకున్నామన్నారు. మరో 20 పాఠశాలల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మిగిలిన పాఠశాలలకు సంబంధించిన పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, రోడ్లు, భవనాలు,పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు రాంమోహన్, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ఎన్నికలకు యంత్రాంగం సిద్ధం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాబోయే ఎన్నికలకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్రస్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఉపయోగం, డిజిటల్ ఔట్రీచ్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్రస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే ప్రజలకు ఓటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు ఈవీఎంలు, వీవీప్యాట్స్ సంబంధించిన వివరాలను తెలియజేసినట్లు కలెక్టర్ అమయ్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు వివరించడంతో పాటు ఓటు హక్కు విలువను తెలిపినట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా రూపకల్పనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని కలెక్టర్ అమయ్ కుమార్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి చంద్రావతి, ఎన్నికల సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం



మేడ్చల్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

- మండలంలోని పలు గ్రామాల్లో పర్యటన
- అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి

మేడ్చల్‌రూరల్: స్వరాష్ట్రంలో మున్సిపాలిటీలు, గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాయని, అన్నివర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్నివర్గాలకు మేలు చేకూర్చారని, దీంతో గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కావాలనే అడ్డుపడుతున్నారని, ఎన్ని కుట్రలు చేసినా గెలిచేది ప్రజల్లో విశ్వాసం సాధించిన బీఆర్ఎస్సే అన్నారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి, మేడ్చల్‌లోని పలు వార్డుల్లో రూ.4.59 కోట్లతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు నందారెడ్డి, ఎంపీపీ రజితరాజుమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, సర్పంచులు వెన్నెల రామకృష్ణుడు, మహేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధులతో గ్రంథాలయాల అభివృద్ధి

ఘట్‌కేసర్: జిల్లాలో సుమారు రూ.4 కోట్లతో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అలియాబాద్ గ్రంథాలయానికి రూ.60 లక్షలు, శామీర్‌పేట్‌కు రూ.30 లక్షలు, మేడ్చల్‌కు రూ.70 లక్షలతో అదనపు గదులు, మౌలిక సదుపాయలకు వెచ్చిస్తున్నామన్నారు. త్వరలో ఘట్‌కేసర్ గ్రంథాలయంలో కంప్యూటర్ గదిని ప్రారంభిస్తామన్నారు. న్యాయవాది రాఘవరెడ్డి, గ్రంథాలయ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని అడ్డుకున్న దళిత, బీజేపీ నాయకులు

మేడ్చల్‌రూరల్: మంత్రి మల్లారెడ్డికి మేడ్చల్ మున్సిపాలిటీలో నిరసన సెగ తాకింది. మేడ్చల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు విచ్చేసిన మంత్రి మల్లారెడ్డిని స్థానిక బీజేపీ, దళిత నాయకులు అడ్డుకునేందుకు యత్నించారు. మంత్రిగా ఉండి మేడ్చల్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి ఏమీలేదని, ఎన్నికల సమయంలోనే వార్డులో పర్యటిస్తారా అంటూ ప్రశ్నించారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు ఇరు వర్గాలను అదుపు చేశారు. దళిత నాయకులు, బీజేపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేమ్‌దాస్‌పై మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు నవీన్‌రెడ్డి భౌతిక దాడికి పాల్పడ్డారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

దళిత బంధును సమానంగా పంచాలి

ఘట్‌కేసర్: దళిత బంధు పథకాన్ని మాదిగలు, మాలలకు సమాన వాటాలుగా వర్తింపజేయాలని పలువురు మాల మహానాడు నాయకులు మంత్రి మల్లారెడ్డికి శుక్రవారం వినతి అందజేశారు. మొదటి విడతలో మాలలకు అన్యాయం జరిగిందని, రెండో విడతలో ఇరువురికి సమానంగా కేటాయించాలని కోరారు. నర్సింగ్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్, మహేశ్, నాగరాజు, పరుశురాం, బాబు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ఎలక్ట్రానిక్స్‌లో మంచి భవిష్యత్

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి



చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని సన్మానిస్తూ..

కీసర: ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రానిక్స్ రంగం విద్యార్థులకు మంచి భవిష్యత్‌తో పాటు ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని చేవెళ్ల ఎంపీ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. చీర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం 5 రోజులుగా ఎలక్ట్రానిక్ వాహనాలు, భద్రతపై నిర్వహించిన సాధికారిక నైపుణ్య శిక్షణ ముగింపులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బ్రిటిష్ గవర్నమెంట్‌తో అనుసంధానమై నిర్వహించిన ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. బ్రిటిష్ హైకమిషన్ డిప్యూటీ కమిషనర్ గ్యారత్, హైదరాబాద్‌లోని టీహబ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్‌చర్ల, ఎన్‌పీటీసీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వేల్స్ శిక్షకులు విలియం డేవిస్, పాల్ గ్రిఫిత్, అధినేతలు హరీష్‌లోకస్, గగన్ అగర్వాల్, కళాశాల ప్రిన్సిపల్ డా.ఉదయ్ కుమార్, అధ్యాపకులు రాధిక పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులను ఎందుకు అమలు చేయడం లేదు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బొమ్మరాశిపేట గ్రామ రైతుల ధర్నా

శామీర్‌పేట్: హైకోర్టు ఉత్తర్వులను రెవెన్యూ అధికారులు అమలు చేయడం లేదంటూ బొమ్మరాశిపేట గ్రామ రైతులు శుక్రవారం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తమ భూములపై వారి అనుమతి లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినా వాటిని పట్టించుకోకుండా రాత్రికి రాత్రే కొందరు దళారులకు అనుకూలంగా జిల్లా కలెక్టర్, స్థానిక తహసీల్దార్ మార్పులు చేశారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మరాశిపేట గ్రామ రెవెన్యూ పరిధిలోని 362, 363, 367, 369, 370, 371, 361, 338, 339, 323, 324, 401లతో పాటు మరి కొన్ని సర్వే నంబర్లలో సుమారు 506 ఎకరాల్లో 500 మంది రైతులు 40 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తమకు ధరణి పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ ధరణిలోని లొసుగులను కొందరు దళారులు అడ్డుపెట్టుకొని తమ భూములను లాక్కునేందుకు యత్నిస్తున్నారన్నారు. ధరణిలోని లొసుగులతో ప్రస్తుత పట్టాదారులకు అన్యాయం జరుగుతోందని తహసీల్దార్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు.

ఇందిరాప్రియదర్శిని కాలనీ నూతన కమిటీ



మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డితో కమిటీ సభ్యులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు ఇందిరాప్రియదర్శిని వీకర్ సెక్షన్ కాలనీ ఓనర్స్ అసోషియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఏ.వెంకటేష్, ఉపాధ్యక్షులుగా సీహెచ్ కనకయ్య, మేరి, జి.యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శంకరయ్య, కోశాధికారిగా బి.సిద్దులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శ్రీశైలం యాదవ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతివార్డుకు రూ.50 లక్షల నిధులు

పోచారం: బోడుప్పల్‌లోని ప్రభుత్వ భూముల వేలంతో వచ్చిన ఆదాయంలో పోచారం మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు రూ.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు చైర్మన్ కొండల్‌రెడ్డి చెప్పారు. ఈ నిధులను అభివృద్ధి పనులు వినియోగించనున్నట్లు తెలిపారు. పోచారం పురపాలక సంఘంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూముల వేలం ద్వారా వచ్చిన ఆదాయ వివరాలను వెల్లడించారు. అనంతరం ఆదివారం అన్నోజిగూడలో నిర్వహించనున్న బోనాల పండుగ ఏర్పాట్ల గురించి కౌన్సిల్ సభ్యులతో చర్చించారు.

జీపీలో 25 ఏళ్లు దాటిన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీలో 25 సంవత్సరాలకుపైగా పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లను క్రమబద్ధీకరించి, వేతనాలు చెల్లించాలని టీఎన్‌జీవోస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బి.రవిప్రకాష్ కోరారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ జిల్లా ఆఫీస్ బేరర్లు, వివిధ యూనిట్ ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న అర్హత కలిగిన వారిని అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలన్నారు. బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల విజ్ఞప్తి మేరకు వారి సమస్యలను కేంద్ర సంఘం దృష్టికి తీసుకువెళ్లి, ఉద్యోగ భద్రత కల్పించే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆయన పేర్కొన్నారు. బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల పోరాటానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకులు ఈశ్వర్, శశికాంత్, శామ్యూల్ పాల్, పద్మ, మారుతి, రవిచంద్ర, భరత్, వేణుగోపాల్, జేమ్స్‌దాస్, శ్రీనివాస్, పంచాయత్ కార్యదర్శుల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, బిల్ కలెక్టర్ల ఫోరమ్ ప్రతినిధులు మహేందర్, సతీష్, మినిస్టిరియల్ ఫోరమ్ కార్యదర్శి అనిత, మెడికల్ అండ్ హెల్త్ ఫోరమ్ అధ్యక్షుడు సత్యం, రాంచంద్రం, ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ అధ్యక్షుడు శశికాంత్ పాల్గొన్నారు.

ధనిక రాష్ట్రంలో రైల్వే వంతెనకు నిధులు కరువు

బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్



ఘట్‌కేసర్ రైల్వేగేటు వద్ద సంతకాలు సేకరిస్తున్న హనుమాన్, బీజేపీ శ్రేణులు

ఘట్‌కేసర్: ధనిక రాష్ట్రంలో రైల్వే వంతెనకు నిధులు కరువయ్యాయని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విష్పర్ల హనుమాన్ అన్నారు. రైల్వే వంతెన నిర్మించాలని పట్టణంలోని రైల్వే గేటు వద్ద బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడంతోనే వంతెన పూర్తి కావడం లేదన్నారు. ప్రతి 10 నిమిషాలకు ఒకమారు గేటు మూసివేతతో వేలాది మంది ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం కలుగుతుంటే టెండర్ల పేరుతో ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. భూనిర్వాసితులకు నూతన భూసేకరణ చట్టం ప్రకారం పరిహార చెల్లించాలని, రెండు పడకల ఇళ్ల కేటాయించి వంతెన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్‌పెరిక, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు రామతీర్థ, రవీందర్‌రెడ్డి, బీజేవైఎస్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చందుయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు విక్రాంత్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రవిశంకర్, మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి సంతోశి, మధుగౌడ్, వీరేశం, ఎల్ పవన్, సుదర్శన్, ఆంజనేయులు, వెంకటేశ్, వీరేశం, మధుసూదన్‌రెడ్డి, శివ, సురేందర్, బి.పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డిని తిరగనివ్వం

- బాధితులకు న్యాయం చేసేవరకు పోరాటం
- జవహర్‌నగర్‌లో ప్లాట్ల బాధితుల నిరసన



జవహర్‌నగర్‌లో ప్లాట్ల బాధితులతో కాంగ్రెస్, బీజేపీ నేతలు

జవహర్‌నగర్: పేద ప్రజలకు న్యాయం జరిగే వరకు జవహర్‌నగర్‌లో మంత్రి మల్లారెడ్డిని తిరగనివ్వమని కాంగ్రెస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, బీజేపీ జవహర్‌నగర్ అధ్యక్షుడు రంగుల శంకర్‌నేత హెచ్చరించారు. జవహర్‌నగర్‌లోని సర్వే నెం.613, 614లలో 15 సంవత్సరాల క్రితం ప్లాట్లు కొనుగోలు చేశామని ఆ స్థలంలో మంత్రి మల్లారెడ్డి కూరగాయల మార్కెట్ పేరుతో మమ్మల్ని రోడ్డున పడేశారని ఆరోపిస్తూ నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. జవహర్‌నగర్‌లోని అంబేడ్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాల ఆవరణలో చేపట్టిన దీక్ష శుక్రవారానికి 4వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు మద్దతుగా కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులు హాజరై మాట్లాడారు. జవహర్‌నగర్‌లోని సర్వే నెం.613, 614లో కేసీఆర్ కూరగాయల మార్కెట్ పేరుతో పేద ప్రజల భూములను మంత్రి మల్లారెడ్డి లాక్కొని వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్లాట్ల బాధితులకు న్యాయం చేస్తానని రెండేళ్ల క్రితం వారిని ఇంటి చుట్టూ తిప్పించుకుని వారికి న్యాయం చేయకుండా రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాట్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులతో పాటు ప్లాట్ల బాధితులు కొమ్ము ఆనంద్, కన్నెమైన నర్సింహయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలేరు రమేష్, పాపిరెడ్డి, బ్రహ్మాచారి, శ్రీనివాసచారి, అనిత, శోభ, భాగ్య తదితరులు పాల్గొన్నారు.